# అనగనగా ఓ మనసు కథ

- ముచ్చర్ల రజనీ శకుంతల

నేను...

మనసును... మనసున్న మనసుని...

నాకు ఆకారం లేదు. స్వరపేటిక లేదు. అయినా విశ్వమంతా పరుచుకున్న మనసును నేను. నాకు పేరు లేదు. కులం లేదు, మతం లేదు. వర్ణము, వర్గమూ, జాతి విభేదమూ తెలియదు. వీధిలో యాచించే ముష్టివాడి మొదలు ప్రపంచాన్ని ఏలే చక్రవర్తి వరకూ... వాళ్ళలో నేనే వుంటాను. ఆ దేవుడు ఒక్కడే... ఆ దేవుడి రూపాలు వేరు. అవతారాలు వేరు. వేరు వేరు పేర్లతో పూజించినా దేవుడొక్కడే కదా...

అలానే నేను కూడా! అందరిలో వుండే నేను ఎప్పుడూ పెదవి విప్పి మాట్లాడను. కొందరు నన్ను ఎంతో ఇష్టంగా తన శరీరంలో దాచుకుంటారు. మరి కొందరు నన్ను బహిష్కరిస్తారు. 'మీకసలు మనసుందా?' అని ఈ మనుష్యులు ఒకరినొకరు సాధించుకుంటూ, దూషించుకుంటూ వుంటే నవ్వొస్తుంది నాకు.

అవును... నేను లేనిచోట, మంచి వుండదు. మంచి మనిషి అంటారు. మనసున్న మారాజు అంటారు. నేను లేని చోట శూన్యమే... నేను లేని చోట విధ్వంసమే. ప్రతి మనిషిలోనూ విధిగా నేనుంటాను.

మీకు హాశ్చర్యంగానూ, అనుమానంగానూ వుండి వుండొచ్చు. ఈ మనసు ఏమిటి? అని... ఈ ప్రపంచంలో దేవుడ్ని నమ్మేవారున్నారు. 'దేవుడు లేడు' అని వాదించే వాళ్ళూ ఉన్నారు. అలానే నేను వున్నానని అనుకునే వాళ్ళూ వుంటారు. 'నేనసలు లేను' అనే వాళ్ళూ వుంటారు. నా ఉనికి మీకు కనిపించదు. నా మాట మీకు వినిపించదు.

'ఈ మనిషి శరీరంలో నా నివాసం ఎక్కడ? మెదడులోనా? గుండెలోనా? పెదవుల్లోనా? నిజం చెప్పాలంటే మనిషి శరీరమంతా ఆవరించి వుంటాన్నేను.

నాకు ఆకారం లేదని చెప్పానుగా... గాలి కనిపించదు. కానీ, దాని ఉనికిని విస్మరించలేము. అలానే నా. ఉనికి కూడా... సోత్కర్ష అని అనుకున్నా యిది నిజం.

నేను లేని చోటు చూపిస్తాను. కొందరిలో నేనసలు లేను. చూస్తారా.. రండి. నాతోపాటు కదలిరండి. నేను లేని మనుష్యులను చూసి ఆలోచించండి. అదిగో... అక్కడ చూడండి... రక్తసిక్తం.. ఈర్ష్యాద్వేషాల మయం. ప్రతీకారేచ్ఛలూ... భీభత్స దృశ్యాలు.. చూడండి.. కాని కాని ఆ మనుష్యులను...

★ ★ ★

రెండు వర్గాలు ఢీకొన్నాయి.

ఫ్యాక్షనిష్టులనేల..

ఆదమరిచి నిద్రపోతున్నాడతను.. అతని చుట్టూ ఆయుధాలతో మనుష్యులు పహారా కాస్తూనే వున్నారు. అయినా ఓ చిన్న అలికిడి.

ఆ ఆయుధదారులు తేరుకునేలోగా... ఓ పదిమంది ధృఢకాయులు ఆదమరిచి నిద్రపోతున్నవాడిని సమీపించేరు.

"చంపండి.. నరకండి.. కొట్టండి... అరుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోతోంది.

పహారా మనుష్యులు తేరుకోకముందే, ఆదమరిచి నిద్రపోతోన్న మనిషిని, శత్రువర్గం ఖండ ఖండాలుగా నరికింది. రక్తం ఏరులైంది. ప్రతీకారం భగ్గుమంది. మొండెం నిర్వీర్యమైంది.. అతని ప్రాణం ఎప్పుడో అనంతవాయువుల్లో కలిసింది.

అంతే... ఆ తర్వాత వాళ్ళు పారిపోయారు. తమ నాయకుడి దగ్గరకి వెళ్ళారు. అతను వీళ్ళ భుజం తట్టాడు. ఇది జరిగిన ఇరవై నాలుగ్గంటల్లోగా ఆ నాయకుడ్ని దారికాచి, ఇవతలి వర్గంవాళ్లు తునాతునకలు చేసారు. ఆ తర్వాత మళ్ళీ ప్రతీకారం రాజుకుంది.

★ ★ ★

రెండు వర్గాల మధ్య శత్రుత్వం విశ్వరూపం దాల్చింది.

ప్రతీకారేచ్ఛ జడలు విప్పుకుంది.

రెండు కుటుంబాల్లో వారసులు కూడా మిగలనంత శత్రుత్వం.. తర తరాల వైషమ్యం.

★ ★ ★

ఆ ఫాక్షనిజం చూసారా.. ఆ ప్రతీకారం చూసారా..

వాళ్ళలో నేను లేను. అసలు నా ఉనికే భరించలేరు వాళ్ళు. వాళ్ళకు నేను అవసరం లేదు. అందుకే వాళ్ళను మనసులేని మనుష్యులు అంటారు.

ఈ శత్రుత్వమూ.. ప్రతీకారమే కాదు.. ఏ ప్రతీకారం లేకపోయినా.. అకారణంగా.. అటు చూడండి..

ఆ అత్తాకోడళ్ళని చూడండి.

★ ★ ★

ఆ కోడలు అత్తగారి కాళ్ళు వేళ్ళు పడుతోంది. అయినా అత్తగారు కనికరించలేదు. కోడలిని రాచి రంపాన పెడుతూనే వుంది.

ఆ మొగుడు కూడా భార్యను చూసి జాలి తలచలేదు. కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడు. అప్పటికే పుట్టింటివాళ్లు అప్పులు పాలయ్యారు. యింకా పుట్టింటి నుంచి తీసుకువచ్చి, వాళ్ళను నడివీధిలో పడేసే శక్తిలేదు.

ఆ అత్త కిరోసిన్‌ని కోడలిపై పోసింది. మరిది అగ్గిపుల్ల వెలిగించాడు. మొగుడు సిగరెట్ అంటించుకొని, ఆ అగ్గిపుల్లను భార్య మీధికి విసిరేసాడు. ఏ. అగ్నిసాక్షిగా భార్యతో సప్తపది నడిచి, మూడు ముళ్ళు వేసాడో... ఆ అగ్నికి భార్యను ఆహుతి చేసాడు.

ఆ తర్వాత భార్య శవం మీద పడి భోరున ఏడుస్తూ, ఏడుపు నటిస్తూ "వంట చేయబోయి, ప్రమాదవశాత్తు చనిపోయిందని ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం మొదలెట్టాడు.

★ ★ ★

మనసులేని.. నేను (మనసు) లేని ఆ మనుష్యులను చూసారా?

వాళ్ళలో మచ్చుకు అయినా నేనుండను. వాళ్ళకి నాతో అవసరం లేదు. నేను అంటే మనసును.. మంచితనం నా అణువణువూ వ్యాపించి వుంటుంది.

అనుక్షణం నన్ను తమ వెంట వుంచుకునే మనుష్యులను చూస్తారా? అటు చూడండి... అక్కడో అంగవైకర్యం వున్న వ్యక్తి... తన లాంటి అంగవైకల్యం వున్న వాళ్ళకు ఎలా చేయూతనిస్తున్నాడో...

అక్కడ చూడండి... ఆ తల్లి తన స్తన్యంలో పాలు లేవని తెలిసినా బిడ్డకు స్తన్యమిచ్చి, ఆ బాధను ఓర్చుకుంటోంది. తన స్తన్యం నుంచి స్రవించే రక్తం తన బిడ్డకు ఆకలి తీరుస్తుందంటే అందుకు కూడా సిద్దపడుతుందా తల్లి.

అక్కడో భార్యను చూడండి... చావు బ్రతుకుల్లో వున్న భార్యను రక్షించుకోవడానికి తాపత్రయ పడుతున్నాడు. అక్కడో భార్య అంతిమ దశలో వున్న భర్తకు అహర్నిశలూ సేవలు చేస్తోంది.

ఒక్కసారి కళ్ళు మూసుకోండి...

ఒక మదర్ థెరీసా కనిపిస్తుంది.

అనాథలను, ఆర్తులను, బాధాసర్పదష్టులను చేరదీసి అక్కున చేర్చుకొని, తన బిడ్డల్లా చూసుకుంటోన్న మదర్ థెరీసా...



ఆమె జీవితమంతా పేదలకోసం, అనాధ బాలలకోసం, ఆర్తులకోసం... బాధావప్తదప్తులకోసం...

ఓ సిస్టర్ నివేదిత...

అదిగో బోసినవ్వుల బాపూజీ...

శత్రువులను కూడా ప్రేమించే క్షమాగుణం వున్న గొప్ప వ్యక్తి.

వీళ్ళందరిలోనూ నేను వున్నాను.

వీళ్ళందరికీ నేను కావాలి...

మనిషి బ్రతకడానికి ఊపిరి కావాలి. కానీ, ఆ మనిషి మంచితనంతో బ్రతకడానికి 'మనసు' కావాలి. ఊపిరి ఆగిపోతే, కృత్రిమ శ్వాస.. మరి మనిషి చెడిపోతే... ఆ చెడిపోయిన మనిషిని బ్రతికించడానికి ఈ 'మనసు' కావాలి.

వాడి మనసు మంచిది కాదు, వాడికసలు మనసు లేదు... అంటారు. మనసు ఎప్పుడూ మంచిదే... మనసు చెప్పినట్టు మనిషి వినడు.. మెదడు చెప్పినట్టు మనిషి నడుచుకుంటాడు.

ఆ మెదడుకు విచక్షణ వుంటుంది. విచక్షణకు ఆ మెదడు ఆదరిస్తోంది. కానీ మనిషే బలవంతంగా విచక్షణను తొక్కిపెడతాడు. నేను (మనసు)లేని మనిషిగా మారుతాడు.

ఎప్పుడైతే 'నన్ను బహిష్కరిస్తాడో.. అప్పుడే ఈ మనిషి అధఃపాతాళానికి వెళ్తాడు.

మనసులేని మనిషి జీవితం వృధా. ఈ ప్రపంచంలో డబ్బులేని వాడు.. దరిద్రుడు మాత్రమే.

కానీ, మనసులేని వ్యక్తి దౌర్భాగ్యుడు.. డబ్బు లేకపోవడం దారిద్ర్యం అయితే, మనసు లేకపోవడం దౌర్భాగ్యం.

అందుకే నేను లేకుండా, మీరు బ్రతక్కండి. నన్ను ఆహ్వానించండి. మీ పిలుపు కోసమే నేను ఎదురుచూస్తున్నాను. నాకు బ్రతకాలని వుంది. విశ్వమంతా పరుచుకొని ఈ మనుష్యుల హృదయాల్లో 'మనసు'గా బ్రతకాలని వుంది.

మనసున్న మనిషి అని మిమ్మల్ని తోటివాళ్ళు గుర్తిస్తుంటే, ఆ గొప్పదనం నాకే లభించిందన్న ఆనందం. నేను మీలో వుంటే మానవత్వం మీలో వున్నట్టే.

నేను స్వచ్ఛమైన దాన్ని. స్పష్టమైన దాన్ని. దయచేసి నన్ను ద్వేషించకండి.

నన్ను ద్వేషించి, ఈ ప్రపంచం మిమ్మల్ని ద్వేషించేలా చేసుకోకండి.

నాకు కులమత బేధాలు లేవు. వర్ణవర్గ విభేదాలు తెలియవు. జాతి విబేధాలు లేవు.

ఏ దేశమైనా ఈ విశ్వమంతా నేను వుంటాను.

నేను చిరంజీవిని... నేను వున్న మీరు ఈ ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోతారు. నా వ్యధ వినండి. నా వేదన ఆలకించండి. నా నివేదన స్వీకరించండి.

ఇదే నా విన్నపం.

ఇదే నా వేడికోలు.

ఇదే నా నివేదన.

ఇది ఓ మనసు కథ.

ఇది ఓ మనసు వ్యధ.

మీరూ మనసువున్న మనుష్యులుగా మారండి. మీ అందరిలో నేను చిరస్థాయిగా వుండాలి. ఎప్పుడూ మీలో చిరస్థాయిగా నిలిచిపోవాలని కోరుకునే మీ మనసు.

★